# అక్షరకేతనంగా ఎగిసి...



డా. సమ్మెట విజయ






అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒక అరుదైన సంస్థను మీకు పరిచయం చేయబోతున్నాను. "ఆడది అంటే అబల కాదు, ఆడించే బొమ్మ కాదు. ఆది శక్తి ఆడది... అజేయ శక్తి ఆడది". అని నిరంతరం తలపోసే సంస్థ అక్షరయాన్. ఊయల ఊపే హస్తాలే ప్రపంచ పాలనా పగ్గాలు చేపడితే అదెంత మాతృభావనతో ఉంటుందో మనకి కొన్ని దేశాలు నిరూపిస్తూనే ఉన్నాయి. జనాభాలో సగభాగమైనా ఇంకా మహిళలు ద్వితీయ శ్రేణి పౌరులుగానే చూడబడుతున్నారు. ఈ వివక్షను ఎదిరిస్తూ తెలుగు సాహితీ పరిపుష్టిలో తమ భాగస్వామ్యాన్ని పెంచుకుంటూ మాతృదేశాన్ని, మాతృభాషను, మాతృమూర్తిని గౌరవించుకోవాలనే సంస్కారాన్ని ముందుతరాలకు నేర్పిస్తూ, ఉవ్వెత్తున్న ఎగిసే చైతన్యంతో అక్షరయాన్ తెలుగు ఉమెన్ రైటర్స్ ఫౌండేషన్ సంఘటిత శక్తితో ఏకీకృతమైంది.

అక్షరయాన్ ప్రస్థానం ఒక్కమాటలో చెప్పేది కాదు. తొలి సమావేశం అక్షరయాన్-5 పేరుతో 40 మంది రచయిత్రులతో మొయినాబాద్లో 2019 జూలై 14 తేదీన ప్రారంభమైంది.

1. మొయినాబాద్ రిసార్టులో తొలి సమావేశం శ్రీ నాళేశ్వరం శంకరం గారి ప్రసంగంతో ప్రారంభమై రచనలు చేసే వారు తాము చేసే రచనలపట్ల ఎటువంటి శ్రద్ధ చూపించాలో..వస్తువు, శిల్పనిర్మాణాలలో తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి ఇచ్చిన వివరణాత్మక ప్రసంగం రచయిత్రులకు ఎంతగానో తోడ్పడింది. తరువాత ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణాధికారి శ్రీ. సి. యస్. రాంబాబు మాట్లాడుతూ రేడియోలో కథలు, కవితలు రాసేటప్పుడు పాటించవలసిన మెళకువలను తెలియచేసారు. రచయిత్రులంతా ముఖాముఖి కలుసుకుని పరిచయాలు చేసుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకున్నారు.

2. అక్షరయాన్ చేపట్టిన రెండవ కార్యక్రమం రేడియోలో కవిసమ్మేళనం. అనుకున్న దానిని చిత్తశుద్ధితో ఆచరిస్తూ 20 మంది కవయిత్రులతో "పసిమొగ్గలు" పేరుతో ఆకాశవాణిలో ప్రత్యక్షప్రసారంగా కవిసమ్మేళనం అయినంపూడి శ్రీలక్ష్మి, మోహిత కౌండిన్యల వ్యాఖ్యానంతో, సి.ఎస్. రాంబాబు గార్ల నిర్వహణలో సాగింది.

3. అక్షరయాన్ మూడవ కార్యక్రమంగా రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్లో 8-8-2019న ఫేస్ టు ఫేస్ విత్ సెల్ఫీ ఆఫ్ సక్సెస్ శ్రీ బుర్రా వెంకటేశం పుస్తక విజయంలో పాలుపంచుకోవడం, అదేరోజు మధ్యాహ్నం అక్షరయాన్ రచయిత్రులు తమలో ఒకరైన ప్రముఖ కథా రచయిత్రి కె.బి.లక్ష్మి హఠాత్తుగ మరణించినందున వారి పిల్లల సమక్షంలో ఒక సంతాప సభను నిర్వహించింది. రచయిత్రులందరూ తమ అనుభవాలను పంచుకోవడం ఆమెకు నివాళిగడించడం జరిగింది.

4. అక్షరయాన్ చేపట్టిన కార్యక్రమాలలో మహత్తరమైన కార్యక్రమం 17-10-2019న హైదరాబాద్లోని తెలంగాణ రాష్ట్ర మహిళా భద్రత విభాగ కార్యాలయం సమావేశ మందిరంలో జరిగింది. భరోసా వారి ఆధ్వర్యంలో అక్షరయాన్ రచయిత్రుల సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమాన్ని తరుణి వ్యవస్థాపకులు డా. మమతా రఘువీర్



ఏర్పాటు చేసారు. అక్షరయాన్ వ్యవస్థాపకులు అయినంపూడి శ్రీలక్ష్మి గారి ప్రారంభోపన్యాసం, అనంతరం మమతా రఘువీర్ గారు భరోసా అందిస్తున్న సేవలు, సాధించిన విజయాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో వివరిస్తూ సంబంధిత వీడియోలను ప్రదర్శించారు. భరోసా కేంద్రం నిర్వహణ,పనితీరు, రేప్ కు గురైన వారిని ఇతరత్రా హింసలు ఎదుర్కున్న వారిని ఎలా రిసీవ్ చేసుకుంటారు, వారికి ఎలా ధైర్యం చెప్తారు. వారిని భరోసా కేంద్రంలో మామూలుగ ఎటువంటి భయం లేకుండా తగిన ఏర్పాట్లు చేస్తారో ఏయే జాగ్రత్తలు తీసుకుంటారో కళ్ళకు కట్టినట్లు వివరించారు.

తరువాత పోలీసు అదనపు కమీషనర్ శ్రీమతి స్వాతి లక్రా గారు అద్భుతమైన ప్రసంగంతో “పోలీసు వ్యవస్థ” భరోసా ద్వారా, షీ టీమ్స్ ద్వారా చేస్తున్న సేవను పనితీరును వివరించారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలను రచనలద్వారా అందించి మహిళలు ఆ సమస్యలను ఎదుర్కునే దిశలో పయనించేలా చేయవలసిన బాధ్యత రచయిత్రులదే అన్నారు.

5. భరోసా నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమం అందరినీ కదిలించి రచయిత్రులను కలం పట్టి అత్యాచార, గృహహింస బాధిత స్త్రీల సమస్యలను కథల రూపంలో వెలికి తీసే పనికి పురమాయించింది. షీ టీమ్స్ పని తీరును ప్రశంసించిన రచయిత్రులకు షీటీమ్స్ మీద కవితలు రాయమనే అవకాశం డిజిపి స్వాతి లక్రా గారు రచయిత్రులకు కలిగించారు.

6. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న బతుకమ్మ, బోనాల సంబురాలను ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అక్షరాయాన్‌కి ఎప్పుడూ తమ సహకారాన్ని అందిస్తూ వచ్చిన కల్వకుంట్ల కవిత గారు జాగృతి పరంగా బతుకమ్మ కవితాంశంగా కవితా సంకలనం బాధ్యతల్ని అక్షరయాన్‌కి అందజేశారు. అనుకున్నదే తడవుగా, నెల రోజుల లోపల “పూల సింగిడి” కవితా సంకలనం ఆవిష్కరణకు సిద్ధమైంది. 30-10-2019 నాడు పెద్దయెత్తున బతుకమ్మ ఆటపాటలతో కవిసమ్మేళనాలతో సంబురాలు రవీంద్రభారతి మూడు వేదికల మీద ఏకకాలంలో జరిగాయి.

7. అదే రోజు సాయంత్రం అక్షరయాన్ కవయిత్రులు మరోచరిత్ర సృష్టించారు. రాజ్భవన్లో రాష్ట్ర గవర్నర్ డా. తమిళిసై సౌందరరాజన్ గారితో బతుకమ్మ సంబురాలలో పాల్గొని పుస్తకాలన్ని పేర్చి పుస్తక బతుకమ్మను పూలబతుకమ్మతో జత చేర్చి గవర్నర్ గారితో కలిసి తొలిసారిగా రచయిత్రులు బతుకమ్మను రాజ్భవన్లో ఆడారు. డా. వాణి దేవులపల్లి ఈ కార్యక్రమానికి ఆంగ్ల వ్యాఖ్యాత్రిగా మారి చక్కగా సయన్వయం చేశారు. స్వతహాగా రచయిత్రి అయిన గవర్నర్ గారితో అక్షరయాన్ రచయిత్రులందరూ విందులో పాల్గొన్నారు.

8. అక్షరయాన్ విజయవంతంగా నిర్వహించిన కార్యక్రమం “విత్తన సదస్సు”. డిసెంబరు 21వ తేది రెడ్హిల్స్లోని ఫాప్సీభవన్లో దాదాపు 312 మంది రచయిత్రులతో కని విని ఎరుగని రీతిలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ రచయిత్రులకు చక్కని అవకాశం ఇచ్చి రచయిత్రులచేత మంచి రచనలు చేయించాలని పూనుకున్నది. అక్షరయాన్ సౌజన్యంతో వ్యవసాయ శాఖ వారు నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంత్రివర్యులు శ్రీ నిరంజన్ రెడ్డి గారు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శ్రీ పార్థసారథి గారు, తెలంగాణ రాష్ట్రప్రభుత్వ సాంస్కృతిక శాఖ సంచాలకులు శ్రీ మామిడి హరికృష్ణ గారు, తెలంగాణ విత్తన ఉత్పత్తి సంస్థ మానేజింగ్ డైరెక్టర్ శ్రీ కేశవులు గారు, మోటివేటర్ డా. శివప్రసాద్ గార్లు విచ్చేసారు. శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మి కార్యక్రమ నిర్వహణను అత్యద్భుతంగా చేపట్టారు.

9. మరింత ఉత్సాహంగా ముందడుగు వేసిన రచయిత్రులు ఎన్ టి ఆర్ స్టేడియంలో ప్రతి యేడాదీ జరిగే





పుస్తక ప్రదర్శనలో తమ పుస్తకాలను తీసుకువచ్చి ప్రదర్శనకు ఉంచారు. అక్షరయాన్ రచయిత్రులు 204 నెంబరు స్టాలులో తమ రచనలను పొందుపరిచి అక్షరయాన్ స్థానాన్ని ప్రత్యేకంగా నిలుపుకున్నారు.

10. వీరి ఉత్సాహానికి ఊపిరి పోస్తూ 26-12-2019 న నోముల సత్యనారాయణ వేదిక మీద నిర్భయ నుంచి దిశ దాక సాహితీప్రస్థానం పేరుతో జరిగిన సాహితి సమాలోచనలో కవిత్వం గురించి, కథ గురించి రకరకాల ప్రసంగాలు కొనసాగాయి. స్వచ్ఛంద సంస్థలు, షీ టీమ్స్ గురించి మమత రఘువీర్ గారు, ఉద్యమాలు గురించి శాంతి ప్రబోధ గారు, పుస్తకాలు గురించి రాజీవ గారు, స్త్రీ వాదం గురించి భండారు విజయ గారు ప్రసంగాలు చేసారు.

మరొక గొప్ప విషయం అమ్మలూ ..అమ్మమ్మలూ ఐన వీరు పిల్లల భవితను దృష్టిలో పెట్టుకుని మన మాతృభాష తెలుగు మృత భాష కాకూడదని పిల్లలమీద దృష్టి సారించి 7-11-20న అక్షరయాన్ బాల, బాలికల విభాగాన్ని స్వాతి లక్రా, ఐజి గారి చేతులమీదుగా ప్రారంభించారు. ఈ విభాగాన్ని ఘాలి లలిత సమర్ధవంతంగా నిర్వహిస్తూ పిల్లలలో సాహిత్య పిపాసను పెంచుతుంది. ఈ విభాగం ద్వారా బాలబాలికలకు దేశభక్తి గీతాలు, కవితలుపోటీలు నిర్వహించారు.

కళావిభాగాన్ని సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారు డా. భండారు సుజాతా శేఖర్ గారు. అదేవిధంగా సినారే దాశరథి గారి జయంతి సందర్భంగా పిల్లలకు పాటల పోటీలు లలిత గీతాలు పోటీలు వకృత్వపు పోటీలు నిర్వహించారు. మానసిక వికాసానికి పిల్లలకు చొక్కాపు వెంకటరమణ గారి చేత, లావణ్య గారి బృందం చేత జూమ్ వేదికన కార్యక్రమాలు నిర్వహించారు. బాలబాలికలు చేత సరళ శతకాలు రాయించారు. గజల్స్ శిక్షణనిప్పిస్తున్నారు. నల్లహంస అనే గొలుసు నవల బాల బాలికలచే రాయించారు. అక్షరయాన్ తరఫునుంచి 108 మందితో మాయలోకం అనే గొలుసు నవల రాయించారు. యన్. హెచ్. ఆర్. క్రియేషన్స్ ద్వారా గొలుసు నవలను యుట్యూబ్లో అప్లోడ్ చేశారు. గొలుసుకట్టు నవల సంధాన కర్త సూత్రదారి కూడా విభాగపు అధినేత్రి ఘాలి లలిత గారే.

11. ఇదే ఉత్సాహాన్ని ద్విగుణీకృతం చేసుకుంటూ 2020 లో భరోసా కథల సంకలనం 'నింగిని గెలిచిన నేల' ఆవిష్కరింప బడింది. షీ టీమ్స్ నుండి "హితైషి" కవితల సంకలనం తరువాత వచ్చిన పుస్తకం ఇది. అదే కార్యక్రమంలో అక్షరయాన్ బాలికా-బాలుర విభాగాన్ని శ్రీమతి స్వాతి లక్రా, ఐ.జీ., శ్రీమతి సుమతి, ఐ.పి.ఎస్. గార్లు ప్రారంభించారు.

12. కరోనా సమయంలో 'రిటర్న్ గిఫ్ట్ టు కరోనా' వీడియో కవితల్ని దాదాపు 800 వరకూ యూ ట్యూబ్ లో పొందు పరచడం జరిగింది.

13. 2021 జనవరి 15 న - పెరుగుతున్న సాంకేతిక ప్రగతిని అందిపుచ్చుకుంటూ తమ రచనల్ని, కార్యక్రమాల్ని అందరికీ చేర్చాలనే సంకల్పంతో సుధాశేఖర్, మిల్వాకీ గారి ఆధ్వర్యములో ఒక వెబ్ సైట్ తయారైంది. సాయి వంశీ, అనన్య, మణినాథ్ నేతృత్వంలో ఈ వెబ్ సైట్ రూపొందింది. దానిలో అక్షరయాన్‌కి సంబంధించిన సమస్త సమాచారంతో పాటు 800 మందికి పైగా కవయిత్రులు తమ వివరాల్ని పొందుపర్చారు.

14. 2021 ఫిబ్రవరి 21న - అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంగా పర్యాటక శాఖ వారి హరిత హొటల్లో మహారాష్ట్ర పూర్వ గవర్నర్ శ్రీ చెన్నమనేని విద్యాసాగర్ రావు గారి నేతృత్వంలో సంబరాలు ఘనంగా జరిగాయి. మాతృభాష సేవకు గానూ రాష్ట్ర సాంస్కృతిక సలహాదారు రమణాచారి ఐ.ఏ.ఎస్. (రి) గారికి విశిష్ట పురస్కారాన్ని అందించారు. వి.వి. లక్ష్మీ నారాయణ, ఐ.పీ.యస్. గారు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. మాతృభాషా పరిరక్షణలో విశిష్ట సేవలందించిన ఆరుగురిని సత్కరించగా, 14 పుస్తకాలు ఆవిష్కరింప బడ్డాయి.

15. జూన్ 24 న - వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి గారి కార్యాలయంలోనే అక్షరయాన్ నేతృత్వంలో కోట్ల వేంకటేశ్వర రెడ్డి గారి 'సరళ శతకాన్ని' ఆవిష్కరించారు.

16. జూలై 21-22 తేదీల్లో సాయంత్రం 6 గంటలకు జూమ్ వేదికగా దాశరథి సాహితీ సమాలోచన సభలు నిర్వహించాం. తెలంగాణ భాషా సాంస్కృతిక, హృదయ

భారతితో కలిసి అక్షరయాన్ సంయుక్త సమర్పణలో జరిగిన ఈ సభల్లో దాశరథి సాహిత్యం మీద డా. వద్దేపల్లి కృష్ణ, రాజ చంద్రిక, డా. వి.వి. రామారావ్, డా. జయప్రకాష్, చిపుకుల శ్రీలక్ష్మి పత్ర సమర్పణ చేసారు. ఈ కార్యక్రమానికి మామిడి హరికృష్ణ గారు ముఖ్య అతిథిగా విచ్చేసారు.

22వ తేదీన పిల్లలకి, పెద్దలకి, వృద్ధులకి – దాశరథి లలిత గీతాలు, దాశరథి సినిమా పాటలమీద పోటీలు నిర్వహించాం. ఈ కార్యక్రమానికి మ్యూజిక్ డైరెక్టర్ చరణ్ అర్జున్ ముఖ్య అతిథిగా విచ్చేసారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆర్థిక సహకారంతో సాగిన ఈ కార్యక్రమంలో కొంత ఆర్థిక సహకారాన్ని ఇటీవలే రోడ్డు ప్రమాదంలో తీవ్ర అనారోగ్యం పాలైన తోటి రచయిత్రి విజయలక్ష్మి గారికి అందజేయాలని నిర్ణయించారు. తదనంతరం భాషా సాంస్కృతిక శాఖ వారు కార్యక్రమ నిర్వహణకు గాను అందించిన మొత్తం నుంచి రూ. 35,000/- వరకు విజయలక్ష్మికి ఆర్థిక సహకారాన్ని అందచేసింది అక్షరయాన్.

17. జూలై 26వ తేదీ నుంచి ఆగస్టు 01వ తేదీ వరకూ డా. సినారె జయంతోత్సవ సాహితీ సప్తాహాన్ని జూమ్ వేదికగా నిర్వహించడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, అక్షరయాన్, అక్షరకౌముది సంస్థల సంయుక్త నిర్వహణలో ఈ ఏడు రోజుల కార్యక్రమాలు జరిగాయి.

18. 05-08-2021 రోజున – శ్రీ బుర్రా వెంకటేశం, ఐ.ఏ.ఎస్., గారి మాతృమూర్తి కీ.శే. శ్రీమతి బుర్రా గౌరమ్మ కి నివాళిగా అక్షరయాన్ 6 పుస్తకాలు వెలువరించింది. 1 ) అమ్మ అమ్మే 2) అమ్మ ఓ అద్భుతం ... అంతుచిక్కని రహస్యం 3) తల్లీ ... నిన్ను తలచి... 4) నీ వేలు పట్టుకొని... 5) అమ్మా! నీ కమ్మని పిలుపు మళ్ళీ వినాలి! 6) మళ్ళీ ఎప్పుడు వస్తావమ్మా!

19. 24/09/2021 – 'శతక షోడశి' – 16 మంది సాహిత్యకారులు వ్రాసిన 16 సరళ శతకాల సంకలనాన్ని కూడా ఆవిష్కరించుకున్నారు.

20. 17/10/2021 – అనుబంధాల పూదోట, శ్రీ బుర్రా వెంకటేశం, ఐ.ఏ.ఎస్., గారి నూతన సాహిత్యప్రక్రియను అనుసరిస్తూ, 156 మంది సాహిత్యకారులు రాసిన రాసిన సూక్ష్మ కావ్య పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం – రవీంద్ర భారతిలో జరిగింది.

21. 18 – 28 డిసెంబర్, 2021. ఎన్టీఆర్ స్టేడియం (తెలంగాణ కళా భారతి) లో 34వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనలో విశ్వాసాహితి ట్రస్ట్ అధ్వర్యంలో తెలుగు ప్రపంచ వేదికతో కలిసి అక్షరయాన్ స్టాల్‌ను ఏర్పాటు చేయటం జరిగింది. ఈ పుస్తక ప్రదర్శనను దాదాపు 5 లక్షల మంది సందర్శించారు.

22. 2022 ఫిబ్రవరి, 21న – అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంగా పర్యాటక శాఖ వారి హరిత హోటల్ లో వేడుకలు నిర్వహించబడ్డాయి. ముఖ్య అతిథిగా మహారాష్ట్ర పూర్వ గవర్నర్ శ్రీ చెన్నమనేని విద్యాసాగర్ రావు, విశిష్ట అతిథిగా శ్రీ వి.వి. లక్ష్మీ నారాయణ, ఐ.పీ.యస్., సభకు అధ్యక్షులుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు శ్రీ తంగెడ కిషన్‌రావు విచ్చేసారు. మాతృభాష సేవకు గానూ ఆంధ్రజ్యోతి సంపాదకులు శ్రీ కె. శ్రీనివాస్ గారికి మహాకవి పంపన పేరిట విశిష్ట పురస్కారాన్ని అందజేసారు. మాతృభాషా పరిరక్షణలో విశిష్ట సేవలందించిన పది మంది సాహిత్యకారుల్ని సత్కరించారు. 24 పుస్తకాలు ఆవిష్కరింపబడ్డాయి. మాతృభాషా దినోత్సవం రోజు ప్రతిఏటా పంపకవి పేరిట ఒక అవార్డును అందిస్తామని అక్షరయాన్ ప్రకటించింది. బతుకమ్మ సందర్భంగా కుప్పాంబిక పురస్కారాన్ని ఒక కవయిత్రికి, బండారు అచ్చమాంబ పురస్కారాన్ని ఒక రచయిత్రికి, రూ. 5,116/- నగదు పురస్కారంతో అందించాలని ప్రకటించింది అక్షరయాన్.

23. సెప్టెంబర్ 21న అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటైన జోగులాంబ తల్లి దగ్గరకు విహారయాత్ర చేశారు అక్షరయాన్ బృందం.

24. మహిళా దర్బారులో రాష్ట్ర గవర్నర్ డా. తమిళిసై సౌందరరాజన్ గారిని కలుసుకొని మహిళా సాహితీమూర్తులకు ఒక హాస్టల్ కావాలని విన్నపాన్ని అందించడం జరిగింది.





25. నవంబర్ 25, 2022న ఎయిర్ ఫోర్స్ వారి కార్యక్రమంలో హోటల్ రమదలో "సలాం సైనిక" పుస్తకావిష్కరణ జరిగింది. పరమవీరచక్ర పురస్కార గ్రహీతల మీద 44 మంది కవయిత్రులు కలిసి ఘటించిన కవితాంజలి ఇది.

26. డిసెంబర్ 5వ తేదీన ఒంటికాలితో నృత్యం చేసిన తెలుగు విశ్వవిద్యాలయ విద్యార్థిని భాగ్య కోసం ఉపాధ్యక్షులు తంగెడ కిషన్ రావుగారి ఆదేశానుసారంగా అక్షరయాన్ రచయిత్రులు అక్షరాలా రెండు లక్షల రూపాయిలను సేకరించి కృత్రిమకాలును ఆ కళాకారిణికి ఏర్పాటు చేశారు.

27. డిసెంబర్ 26 నుంచి జనవరి వరకు జరిగిన జాతీయ పుస్తక దినోత్సవంలో అక్షరయాన్ పుస్తకస్టాల్ ను ఏర్పాటుచేసి ఆర్థిక పరిపుష్ఠిని రచయిత్రులకు కలిగించింది.

28. జనవరి 22వ తేదీన కవియాత్ర వ్యవస్థాపకులు కారం శంకర్ గారితో కలిసి అమరవీరుల స్థూపం నుండి గోల్కొండ వరకు 250 మంది కవులతో శాంతి సామరస్యతల మీద కవితాగానం చేస్తూ కవియాత్రను విజయవంతం చేసింది.

29. 2023 ఫిబ్రవరి 21న హరితప్లాజా హోటల్ లో ముచ్చటగా మూడోసారి అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు హరియాన్ గవర్నర్ బండారు దత్తాత్రేయులు గారు, మహారాష్ట్ర పూర్వ గవర్నర్ సి. హెచ్. విద్యాసాగర్ రావు గారు, అడిషినల్ ఛీఫ్ సెక్రటరీ డా. చెల్లప్పగారు విచ్చేసిన ఈ కార్యక్రమంలో జాతీయ పురస్కార సినీ గేయరచయిత శ్రీ సుద్దాల అశోక్ తేజగారికి పంపకవిపురస్కారంతోపాటుస్వర్ణకంకణాన్ని బహూకరించారు. విత్తనం చెప్పిన కథలు, కవితల పుస్తకం 'బీజ స్వరాలు' ఆవిష్కరణలకోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. మహిళా రచయిత్రులు కలసికట్టుగా ఉండి సాధించే అద్భుతాలకు ప్రతీకలుగా నిలిచి అక్షరయాన్ అద్భుతయాన్‌గా మరెన్నో కార్యక్రమాలకు సమాయత్తమవుతుంది.

అన్నింటి కంటే ముందుగా మనం ఇక్కడ చెప్పుకోవాల్సింది అక్షరయాన్ నిర్వహించిన "మాతృవందనం" కార్యక్రమం. తెలుగు విశ్వవిద్యాలయం, భాషా సాంస్కృతిక శాఖ సంయక్త ఆధ్వర్యంలో మే 11వ తేదీన తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన షష్టి పూర్తి కలాలకు సత్కారం కార్యక్రమ స్ఫూర్తితో అక్షరయాన్ కూడా 70 నుంచి 90 ఏళ్ళ వరకు ఉన్న మహిళా సాహితీమూర్తుల సేవలకు గాను సత్కారాలు చేయాలని నిశ్చయించుకుంది. ఆంధ్రప్రదేశ్లో ఉన్న 13 జిల్లాలకు గాను ఒక్కో జిల్లాకు ఇద్దరేసి చొప్పున మొత్తం 26 మందిని ఆయా జిల్లాలే ఎంపిక చేసుకునే విధంగా కృషి చేసి, మిగతా నాలుగైదు రాష్ట్రాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న అక్షరయాన్ రచయిత్రుల నుంచి వయోజిత రచయిత్రులను తీసుకొని వారికి ఒక చీర, శాలువా, పూల దండతో సత్కరించింది. రచయిత్రుల మధ్య అక్కాచెల్లెల్ల వాతావరణం ఉండాలే తప్ప స్పర్ధలు ఉండకూడదంటూ ఈ కార్యక్రమం ద్వారా నిరూపించింది. ఈ కార్యక్రమానికి ఎక్కువగా రూ. 30,000 ఆర్థిక సహకారాన్ని శ్రీవల్లి గారు ఆత్మీయంగా అందించారు. తెలంగాణా చెల్లెల్లు, ఆంధ్రా అక్కయ్యలకు అందించిన "సారె"గా ఇది కొనియాడబడింది.

**భవిష్యత్ కార్యక్రమాలు:–** పసిమొలకలు – రుధిర జ్వాలలు పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టింది. అలాగే విత్తనం మీద "విత్తనం చెప్పిన కథలు", "బీజ స్వరాలు" కథల సంపుటి, కవితల సంపుటిని రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ, రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్త నిర్వహణలో ఆవిష్కరింపచేస్తుంది. అమృతోత్సవ భారతి కార్యక్రమంలో భాగంగా 75 స్వాతంత్ర్యోద్యమ వీడియో కవితల్ని యూట్యూబ్‌లో అప్లోడ్ చేయబోతున్నాం. బాలకవుల బతుకమ్మ సంపుటిని ప్రచురింపబోతున్నాం. బతుకమ్మ పండుగ రోజునాటికి విశిష్టంగా బతుకమ్మ ప్రాశస్త్యాన్ని వెలువరించే వ్యాససంపుటిని ఆవిష్కరించబోతున్నాము.

అవును ప్రపంచాన్ని మార్చాలంటే అక్షరమైనా కావాలి, అమ్మలైనా రావాలి. అందుకే ఆ రెండు కలిసిన మా అక్షరమ్మలు 'అక్షరయాన్' సంస్థతో మీ ముందుకు వస్తున్నాం, మీ ఆశీర్వాదాలను, సహాయ సహకారాలను కోరుతున్నాం.

●